క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

పాలకొల్లు సెంట్రల్: ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేసేవి పత్రికలని అలాంటి పత్రికలకు స్వేచ్ఛ లేకుండా చేస్తున్న పోలీసుల వేదింపులను పట్టణ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకటరమణ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శుక్రవారం సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి ఇంటిలో ఎలాంటి అనుమతులు లేకుండా పోలీసులు సోదాలు చేయడం దారుణమని ఈ సంఘటనపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేసి సీనియర్ అసిస్టెంట్ వి.అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ సమాజంలో చోటుచేసుకున్న సంఘటనలపై పత్రికల్లో వివరించడమే జర్నలిస్టుల ముఖ్య ఉద్దేశమని అలాంటి జర్నలిస్టులను ఇలా వేధింపులు, బెదిరింపులతో కట్టడి చేయాలనుకోవడం చేతికి సంకెళ్లు వేయడంలాంటిదేనని అన్నారు. వచ్చిన వార్తలపై వివరణలు ఇచ్చుకోవాలి గానీ ఇలా బెదిరింపులకు దిగితే ప్రజాస్వామం గొంతును నొక్కుతున్నట్లుగా ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సెక్రటరీ ఎంఎన్‌వీ సాంబశివరావు, ట్రెజరర్ తోట రాంబాబు, సభ్యులు బండి శ్రీనివాస్, పిటి వెంకటేశ్వరరావు, మండెల అప్పలరాజు, పులపర్తి నాని, గోపి, సరగం సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు, బాలాజీ, మద్దా లాజరస్, కారుమంచి గోపాల్ పాల్గొన్నారు.

పెనుమంట్ర ఎంపీడీఓగా ప్రభాకరరావు



పెనుమంట్ర: పెనుమంట్ర మండల పరి షత్ అభివృద్ధి అధికారిగా ముట్నూరి సుబ్రహ్మణ్య ప్రభాకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తూ పదోన్నతిపై పెనుమంట్ర ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఏడాది కాలంగా ఇన్‌చార్జ్ పాలన సాగుతున్న ఈ కార్యాలయానికి ఎట్టకేలకు పూర్తిస్థాయి ఎంపీడీఓను నియమించారు. ఇప్పటి వరకు అత్తిలి ఎంపీడీఓగా పనిచేస్తున్న పి.శామ్యూల్ పెనుమంట్ర ఇన్‌చార్జ్‌గా ఎంపీడీఓగా అదనపు బాధ్యతల్లో పని చేశారు.

అన్న క్యాంటీన్ పరిశీలన



అన్నక్యాంటీన్‌లో ఆహారం ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ విజయసారథి

పాలకొల్లు సెంట్రల్: అన్న క్యాంటీన్‌లో ఆహారం అంతా నాణ్యతతోనే ఉంటుందని సమయానికే ఆహారం అందిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అన్నక్యాంటీన్‌ను ఉదయమే సందర్శించి టిఫిన్ చేస్తున్న పలువురిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారథి మాట్లాడుతూ రోజువారీ మెనూ ప్రకారమే ఆహారం అందిస్తున్నారని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో విజ్ఞాన యాత్ర



విజ్ఞాన యాత్రకు వెళుతున్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో వేసవి విజ్ఞానంలో భాగంగా పట్టణంలో ఉన్న వివిధ పాఠశాలలకు చెందిన 6 నుండి 10వ తరగతి విద్యార్థులను పెద్దాపురం అల్లం రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే సైన్స్ సెంటర్‌కు ఉచితంగా తీసుకుని వెళ్లినట్లు సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ తెలిపారు. సైన్స్ సెంటర్‌ను పరిశీలించిన విద్యార్థులకు ప్రయోగాల గురించి వివరించడమే కాకుండా విద్యార్థులతో స్వయంగా ప్రయోగాలు చేయించారు. పట్టణం నుంచి రెండు బస్సుల్లో సుమారు 60 మంది విద్యార్థులను ఈ విజ్ఞాన యాత్రకు తీసుకువెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు, మంచెం ఉమామహేశ్వరరావు, మంచెం కనకరాజు, చేగొండి కరుణ కుమార్ పాల్గొన్నారు.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వినతి

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ నాలుగు దిక్కులూ ప్రధాన కూడలిలో ఆర్చ్‌లను, పెద్ద పెద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక, అరసవల్లి ట్రస్ట్, జనసేన నాయకులు రైల్వే ఎడిఎన్ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ అతి పురాతనమైనదని నిత్యం ప్రయాణికుల రద్దీతో కోలాహలంగా ఉంటుందని, ఇటీవలే రైల్వే స్టేషన్ ను సుందరీకరణతోపాటు అనేక సౌకర్యాలను కల్పించారని తెలిపారు. అయితే భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్ దూర ప్రాంతాల వారికి తెలియడం లేదని, ఈ స్టేషన్ కు నాలుగు దిక్కుల బోర్డులను ఆర్చ్‌లను ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులను కోరారు. అవసరమైతే బోర్డులకు దాతల ద్వారా సహకరిస్తామని అన్నారు.

పొగతో ఎన్నో అనారోగ్య సమస్యలు

- దోమ కాటు నుంచి రక్షణకు విచ్చలవిడిగా మస్కిటో కాయిల్స్ వాడకం
- వాటి పొగతో అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యుల హెచ్చరిక



కాయిల్ నుండి వస్తున్న పొగ



దోమల నివారణ అగరబత్తి

పాలకొల్లు సెంట్రల్: దోమకాటు వల్ల అనారోగ్యానికి గురవుతామనే విషయం అందరికీ తెలుసు. అయితే ఈ సమస్య నుంచి తప్పించుకోవడానికి చాలా మంది మార్కెట్‌లో అందుబాటులో ఉన్న మస్కిటో కాయిల్స్ వాడడం పరిపాటిగా మారింది. చాలా మంది తక్కువ ధరకు వచ్చే మస్కిటో కాయిల్స్‌తో పాటు గత కొంత కాలంగా వస్తున్న మస్కిటో అగరబత్తుల ద్వారా వచ్చే పొగతో దోమలు రావని వాటిని వెలిగిస్తున్నారు. చాలా మంది వీటిని పడుకునే ముందు వెలిగించుకుంటున్నారు. తలుపులు తీసుకుని పడుకుంటే ఆ పొగ బయటకు వెళ్లిపోతుందని అన్ని తలుపులు బిగించే పడుకుంటున్నారు. దీంతో ఆస్తమా ఉన్న రోగులు, చిన్న పిల్లలు, వృద్ధులు శరీరంలో ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వ్యక్తులు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వీటి ద్వారా వచ్చే పొగకు దోమలు చనిపోవడం లేదు. ఆ పొగ ఉన్నంత సేపు అవి మగతగా పడిపోతున్నాయి. పొగ వాసన తగ్గిన తరువాత అవి మళ్లీ తిరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

పెరిగిపోతున్న నాసిరకం బ్రాండ్‌లు

ఎంత గొప్ప బ్రాండెడ్ వస్తువులు వాడినా పొగ వల్ల మాత్రం అనారోగ్యాలకు గురి కావల్సిందే. అలాంటిది నాసిరకం బ్రాండ్‌లైతే ఇంక ఆ నష్టం మాటల్లో చెప్పలేనిది. మస్కిటో కాయిల్స్, అగర్‌బత్తీలు వివిధ రకాల బ్రాండ్‌ల పేరులతో హైదరాబాద్, బెంగుళూరు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వస్తుంటాయి. అలాగే వివిధ రకాల పరిమళాలతో అనేక రకాల బ్రాండ్‌ల పేరుతో స్థానికంగా కూడా తయారు చేసేస్తున్నారు. వీటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇవి మరింత ప్రమాదకరంగా తయారై ప్రజలు అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుంది. మార్కెట్లో గతంలో రీఫిల్స్ 30, 35, 60 రాత్రులు అని విక్రయించేవారు. నేడు హై, లో ఆప్షన్‌లతో 45 ఎంఎల్ రీఫిల్స్ రూ.85ల ధరలతో వస్తున్నాయి. హై లో పెట్టుకుంటే 10 నుంచి 15 రోజులు మాత్రమే వస్తున్నాయి. లో అయితే 20 నుండి 25 రోజులు వస్తుంటాయి. వీటిని గదికి ఒకటి చొప్పున పెట్టుకుంటుంటారు. సాధారణ, మధ్యతరగతి ప్రజలు చక్రాలు, అగరబత్తిలు వాడుతుంటారు. అవి బాక్స్ వచ్చి రూ. 30 లు ఇందులో పది చక్రాలు ఉంటాయి. అగరబత్తి అయితే రూ. 10లు ఇందులో పది ఉంటా. ఇవి అయితే ఇంటిల్లపాది ఒక చక్రం లేదా ఒక అగరవత్తి వెలిగించుకుంటారు.

ఊపిరితిత్తులపై అధిక ప్రభావం

దోమల నివారణ కొరకు ఉపయోగించే చక్రాలు, అగరబత్తీల పొగ పీల్చడం వల్ల ప్రమాదకరమని వైద్యులు చెపుతున్నారు. తలుపులన్నీ మూసి వెలిగించడం వల్ల కనీసం పొగ బయటకు వెళ్లే మార్గం లేక మొత్తం ఆ గదిలో ఉన్న జనమే పీల్చాల్సి వస్తుంది. దాంతో ఊపిరితిత్తుల్లో పొగ చేరి దగ్గు, ఆయాసం వస్తుంటాయి. దోమల నివారణ కోసం ప్రమాదకరమైన ఉత్పత్తులు వాడే కన్నా ప్రతీ కిటికీకి, గుమ్మాలకు దోమ తెర మెస్‌లు ఏర్పాటు చేసుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

పొగతో సీఓపీడీ సమస్య



దోమలకు సంబంధించిన చక్రాలు, అగరబత్తులే కాదు ఏ రకమైన పొగ పీల్చినా సీఓపీడీ వస్తుంది. అదే ఆస్తమా ఉన్న వారు గాని ఊపిరితిత్తుల సమస్య ఉన్న వారికి గాని ఇలాంటి పొగ పీల్చడం వల్ల సమస్య మరింత జటిలం అవుతుంటుంది. పిల్లలు, వృద్ధులు కూడా ఈ పొగ అతిగా పీల్చకూడదు. ఏదైనా ఒకటి రెండు పర్యాయాలు అంటే సమస్య ఉండదు. ఎక్కవ సార్లు పీలిస్తే మాత్రం అనారోగ్యానికి గురయ్యే ప్రభావం ఉంటుంది.

– డాక్టర్ వర్మ, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, పాలకొల్లు

దోమల నివారణకు ఎన్నో చర్యలు

దోమల నివారణకు అధికారులు ఎన్ని లక్షలు ఖర్చు చేస్తున్నా సరే వాటిని మాత్రం నివారించలేకపోతున్నారు. దోమల నివారణకు టిమోపాస్ మందును వాడుతుంటారు. ఇది 10 ఎం.ఎల్ మందులో పది లీటర్ల నీటిని కలిపి డ్రైనేజీల్లో స్ప్రే చేస్తుంటారు. అలాగే పాగింగ్ మెషీన్ల ద్వారా దోమల నివారణకు చర్యలు చేపడుతుంటారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉన్నప్పుడు వాటిల్లో ఆయిల్ బాల్స్ వేసి నివారణ చేస్తుంటారు. ఇలా ఎన్ని చేస్తున్నా దోమలను మాత్రం నివారించలేకపోతున్నారు. దీంతో ప్రజలు మస్కిటో కాయిల్స్ వాడి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు.

ఘనంగా కేశవస్వామి కల్యాణోత్సవం



భక్తులకు దర్శనమిస్తున్న కేశవస్వామి

యలమంచిలి: స్థానిక విష్ణాలయంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వార్ల కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన కల్యాణోత్సవాలు 12వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. కల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలయ అర్చకులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో దేవేరులకు ఉదయం అర్చనలు, కుంకుమ పూజలు, నిత్యహోమం, ఆలయబలిహరణ సాయంత్రం నిత్య హోమం నిర్వహించారు.

రోగులకు పండ్లు పంపిణీ

పెనుగొండ: ఆచంట వేమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ పండ్లు పంపిణీ చేశారు. శుక్రవారం ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో రోగులకు పండ్లు అందించి ప్రతీ ఒక్కరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో సోనీ శ్వాస్, నన్నేటి లక్ష్మీబాయి, అమల, కోలాటి జయశ్రీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా తాళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

నరసాపురం రూరల్: మండలంలోని లిఖితపూడి గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు హాజరైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ గత మూడు రోజులుగా గ్రామ దేవత తాళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరిపిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో మెలగడం ద్వారా అంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దొంగ మురళీ కృష్ణ, ఉంగరాల రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

సందర్శకులతో కాటన్ పార్కు కళకళ



పర్యాటకులతో కళకళలాడుతోన్న కాటన్‌పార్కు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న కాటన్‌పార్కు పర్యాటకులతో కళకళలాడుతోంది. ఎప్పటి నుంచో మూతపడి ఉన్న పార్కును రూ.1.14 కోట్లతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసి 2023లో ప్రారంభించారు. దీంతో అప్పటి నుంచి పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. వారాంతంతో పాటు సెలవు దినాల్లో అయితే పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులతో పార్కు జనంతో కళకళలాడుతోంది. ముఖ్యంగా పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ ఆకట్టుకుంటుంది. దీంతో రాత్రిపూట కూడా పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. పట్టణంలో రెండు ప్రధాన పార్కులు ఉన్నాయి. ఇందులో ఒకటి కాటన్‌పార్కు కాగా, మరొకటి శారదా థియేటర్ వద్ద బాలయ్యపార్కు. కాటన్ పార్కు శిథిలమై దాదాపు మూతపడంతో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టి పెట్టి పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ప్రణాళికా అభివృద్ధి సంఘం నిధులు కేటాయింపజేశారు. మున్సిపాలిటీ కూడా కొంతమేర జనరల్‌ఫండ్స్ కేటాయించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ముగిసిన స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న వసుధ ఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు ఆర్థిక సహకారంతో ఏప్రిల్ 24న ప్రారంభమైన స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్ ఉచిత శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలకొల్లు క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూర్యబాబు రాజు మాట్లాడుతూ విద్యార్థులు సెలవుల్లో ఇలాంటి శిక్షణ తరగతుల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల పిల్లల్లో మరింత ప్రతిభా పాటవాలు పెరుగుతాయన్నారు. ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు మాట్లాడుతూ సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సుమారు 200 మంది వరకూ పాల్గొన్నారన్నారు. సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో పదో తరగతిలో 592 మార్కులు వచ్చిన గణేషుల నిఖిల్, 588 మార్కులు వచ్చిన రొక్కం చరిష్మా, ఇదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థిని చాంబర్ కళాశాలలో ఇంటర్‌లో స్టేట్ పోర్త్ ర్యాంకు తెచ్చుకున్న ఇరగవరపు లక్ష్మణ వర్షిత్‌లకు నగదు బహుమతులు అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మాంటిస్సోరిస్ ప్రిన్సిపాల్ వసంత లక్ష్మి, శిశుమందిర్ ప్రధానోపాధ్యాయులు ఎన్‌బీవీ సూర్యలక్ష్మి, ఉపాధ్యాయులు రాజు భూషణం, ప్రసాద్, సుదీర్, పద్మావతి పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో జాతీయ టెక్నాలజీ దినోత్సవం



ఏఎస్ఎన్ఎం కళాశాలలో జాతీయ టెక్నాలజీ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు ప్రతి విషయంలో అవగాహన కలగాలంటే ఇలాంటి ముఖ్యమైన రోజులను కేటాయించుకుని అవగాహనా సదస్సులు నిర్వహిస్తే విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.యామిని అన్నారు. శుక్రవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగం, ఐక్యూఏసీ ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ టెక్నాలజీ దినోత్సవం నిర్వహించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.భద్రాచలం మాట్లాడుతూ 1998లో ప్రోక్రాన్ న్యూక్లియర్ వెపన్స్ విజయవంతం అయిన సందర్భంగా మే 11న టెక్నాలజీ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఏపీజే అబ్దుల్‌కలాం వంటి సైంటిస్టుల కృషిని విద్యార్థులకు వివరించారు. డాక్టర్ ఎం.రామకృష్ణ, డాక్టర్ వి.విజయలక్ష్మి, సీహెచ్ రవికుమార్, బి.ఆశాజ్యోతి, పి జ్యోత్స్న, డి హెప్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

12న కాకినాడలో మాలల మహా రణభేరి



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న మాలల మహా రణభేరి నిర్వహించనున్నట్లు పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణ కార్యాలయంలో మహారణ భేరి బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్న మాలమాదిగలను విడగొట్టి దళితుల అభివృద్ధిని అడ్డుకుంటున్న కేంద్ర, ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు భవిష్యత్‌లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ నెల 12న పీవీ రావు 73వ జయంతి పురస్కరించుకుని కాకినాడలో మెక్లారిన్ స్కూల్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు మాలల మహా రణభేరి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొర్రపాటి వీరాస్వామి, బండి సుందర్‌రామూర్తి, వర్ధనపు ఆనంద్, దేవ రాజేష్, వర్ధనపు సురేష్, పెదపాటి పెద్దిరాజు, బొండా బుజ్జిబాబు, ఊటాల చిట్టిరాజు, పిల్లి శ్యామ్, వడ్లమూడి ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన



యలమంచిలి: కట్టుపాలెంలో మాట్లాడుతున్న సర్పంచ్ పొన్నమండ నాగరాజు

యలమంచిలి: బాల్య వివాహాలు యువత జీవితాలకు అనర్థాన్ని తెచ్చిపెడతాయని కట్టుపాలెం సర్పంచ్ పొన్నమండ నాగరాజు అన్నారు. కిషోర వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపు శుక్రవారం కట్టుపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లి చేయాలని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, ఫోక్సో చట్టం, బాల్య వివాహాలు చేస్తే విధించే శిక్షలు గురించి వివరించారు. కార్యక్రమంలో పూరిళ్ల మాణిక్యాలరావు, పొన్నమండ నాగరాజు, పడాల శ్రీనివాస్, అంబటి విజయ్‌కుమార్, రామకృష్ణ, మహిళా పోలీసు లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు జయ కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..



పెనుమంట్ర: మార్టేరు తోకపేట అంగన్‌వాడీ సెంటర్‌లో మాట్లాడుతున్న బి.సుజాతారాణి

పెనుమంట్ర: బాల్యవివాహాలు చట్టరీత్యానేరమని అలాంటి వివాహాలు గ్రామాలలో ఎక్కడైనా జరిగితే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కి తెలియజేయాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుజాతారాణి అన్నారు. కిశోర వికాసం వేసవి కాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె పెనుమంట్ర మండలం మార్టేరులో తోకపేట అంగన్‌వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుని ఆర్థిక స్వావలంభన సాధించాలని, బాలికలు అంగన్‌వాడీ సెంటర్‌లలో ఉచితంగా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంగా ఆత్మవిశ్వాసంతో జీవించాలన్నారు. కార్యక్రమంలో పెనుమంట్ర ఐసీడీఎస్ పీఓ కృష్ణవేణి, నోడల్ ఆఫీసర్ పి.విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు టి పోసమ్మ, ఏఎన్‌ఎం సుజాత, ఈఓ దుర్గాదేవి పాల్గొన్నారు.

నరసాపురంలో..



నరసాపురం రూరల్: చిట్టవరంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఊర్మిళ

నరసాపురం రూరల్: కిషోర బాలికలందరూ బాగా చదువుకోవాలని అందుకు పౌష్టికాహారం ఎంతగానో దోహదపడుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఊర్మిళ అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్టవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని అన్నారు. బాలికలు రుతుక్రమం సమయాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు శుభ్రత గురించి వివరించారు. యోగ, వ్యాయామాలు ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందివ్వాలి

నరసాపురం: ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందివ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ సూచించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తడి, పొడి, ప్రమాదకర చెత్తను మూడు విభాగాలుగా విభజించి సేకరిస్తామని చెప్పారు. ప్రజలు కూడా చెత్తను వేర్వేరుగా అందించి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని చెప్పారు. క్లీన్ పట్టణంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ప్రజలు సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

లోక్ అదాలత్ జూలై 5కు వాయిదా

నరసాపురం: శనివారం జరగాల్సిన జాతీయలోక్ అదాలత్‌ను జూలై 5కు వాయిదా వేసినట్టు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ ఎ.వాసంతి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులకు ఈ విషయంపై సమాచారం ఇవ్వాలని కోరారు. జూలై 5న జరిగే లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా సహకరించాలని సూచించారు.

అధ్వానంగా ఏటిగట్టు లైటింగ్

నరసాపురం: స్థానిక గోదావరి ఏటిగట్టు పొడవునా వీధి లైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎక్కడా సవ్యంగా లైట్లు వెలగడం లేదు. కొన్ని చోట్ల పోయిన లైట్లను మునిసిపల్ అధికారులు తిరిగి ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వలందర రేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా మరెక్కడా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం సమయంలో వీధి దీపాలు సవ్యంగా వెలగకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి పూట వీధి దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారంతో ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధిలైట్లను మరమ్మతులు చేసి పరిస్థితిని చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

'నా భర్తను అన్యాయంగా తొలగించారు'



భర్తకు ఉద్యోగం ఇవ్వాలని మొరపెట్టుకుంటున్న సులోచన

పెనుగొండ: 90 శాతం దివ్యాంగుడైన భర్త చదలవాడ ముత్యాలరావును అన్యాయంగా ఆచంట ఉన్నత పాఠశాల వాచ్‌మెన్ ఉద్యోగం నుంచి తొలగించారంటూ భార్య సులోచన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆచంట పెదపేటలో జరిగిన ఎమ్మార్పీఎస్ మహిళల సమావేశంలో మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ ఉషారాణిలు ఎటువంటి కారణం లేకుండా తొలగించారన్నారు. ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. ఆరోపణలు రుజువు చేయాలని లేదంటే చట్టప్రకారం పరువు నష్టం దావా వేస్తామన్నారు. సత్వరం తన భర్తకు తిరిగి ఉద్యోగం కల్పించి జీవనోపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో కంకిపాటి కొండమ్మ, గంగోలు సుమ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన డైవర్షన్ రోడ్డు



నెగ్గిపూడి వద్ద పంటబోదెపై ముందుగా నిర్మించిన డైవర్షన్ రోడ్డు

పెనుమంట్ర: మార్టేరు-పెనుగొండ రోడ్డులో నెగ్గిపూడి పెట్రోల్ బంకు వద్ద పంట బోదెకు రూ. 59 లక్షలతో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణం కారణంగా 45రోజుల పాటు భారీ వాహనాలను ఆచంట, ఆలమూరు మీదుగా మళ్లించారు. అయితే ద్విచక్రవాహనదారుల రాకపోకలకు ఈ కల్వర్టు వద్ద డైవర్షన్ రోడ్డును నిర్మించారు. అయితే ఈ రోడ్డులో చిన్న కారులు ఆటోలు, మినీవ్యాన్‌లు అనుమతించడంతో ఈ డైవర్షన్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో నాలుగు రోజుల క్రితం వెడల్పుగా వేసిన డైవర్షన్ రోడ్డును మూసివేసి పక్కనే ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు మరో సన్నగా ఉండే డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే ఈ డైవర్షన్ రోడ్డును గ్రావెల్ వేసి నిర్మించాల్సి ఉండగా పక్కనే ఉన్న పంచాయతీ చెత్తతో ఏర్పాటు చేయడంతో ద్విచక్రవాహనదారులకు ఇబ్బందికరంగా, ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై ద్విచక్రవాహనాలు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. గతంలో వేసిన డైవర్షన్ రోడ్డుకే సెంటర్ పోల్స్ ఏర్పాటు చేసి కాపాలదారుడిని పెట్టాల్సిన అధికారులు మరో సన్నని డైవర్షన్ రోడ్డును వేయడం వల్ల ద్విచక్రవాహనాలు దిగబడటమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నాయి. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ డైవర్షన్ రోడ్డుకు గ్రావెల్‌వేసి, ద్విచక్రవాహనాలు మాత్రమే వెళ్లేందుకు అనుమతించాలని ప్రయాణికులు కోరుతున్నారు.